సంపుటి :03 | సంచిక :43 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

సోమవారం 23, మార్చి 2026

వెల ₹5

## ప్రాణం తీసిన రూ.వంద గొడవ



- ఉరివేసుకున్న మహిళా కూలీ
- మానుకోట జిల్లా సూర్యతండాలో ఘటన

02

## కోర్టుకు బాంబు బెదిరింపు

- ఉత్కంఠ రేపిన అజ్ఞాత మెయిల్

05

## ఆర్టీఏ సేవలు ఇక డిజిటల్

- మొబైల్‌లోనే 52 రకాల సేవలు
- ఆఫీసుల చుట్టూ తిప్పలకు చెక్
- రెండో బండిపై ట్యాక్స్ కూడా రద్దు
- వాహన్ పోర్టల్ ప్రారంభించిన మంత్రి పొన్నం

05



## మొండి బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టండి

- జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- నగరంలో ఆకస్మిక క్షేత్ర స్థాయి పన్ను వసూళ్ల పరిశీలన

05



## 28న మెగా లోక్ అదాలత్

- రాజీతో సమస్యను పరిష్కరించుకోండి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

04

# రైతు భరోసా.. ఒక్క ఎకరానికే !


సర్కారు ఇస్తున్న రూ.6 వేలు ఎకరం పొలం దున్నడానికే సరిపోవు. మిగతా సాగు ఖర్చులకు రైతులు ఏం చేయాలి? విడతల వారీగా ఇస్తారా? లేదంటే.. అసలు ఇవ్వరా? స్పష్టత ఇవ్వండి.

— ప్రతిపక్షాల ప్రశ్న

నాకు ఐదు ఎకరాల భూమి ఉంది. కానీ, బ్యాంక్ అకౌంట్లో కేవలం రూ.6 వేలు మాత్రమే పడ్డాయి. మిగతా భూమికి పైసలు ఎప్పుడు వేస్తారు ? ఆలస్యమైనా జమ చేస్తారా లేదా ?

— ఓ రైతు ప్రశ్న

- తొలిరోజు జమ ప్రక్రియలో గందరగోళం
- ఒక రైతుకు ఎన్ని ఎకరాలున్నా.. ఒక ఎకరా సొమ్ము రూ.6 వేలే జమ
- మిగతా భూమికి సాయం సంగతేంటని రైతుల ప్రశ్నలు
- విడతల వారీగా ఇస్తారా? లేక ఈ సొమ్ముతోనే సరిపెట్టుకోవాలా? అనే సందిగ్ధం
- సర్కార్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్లు
- ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్న ప్రతిపక్షాలు



తెలంగాణలో రైతు భరోసా నిధుల విడుదల ఒకవైపు అన్నదాతల్లో ఆశలు రేకెత్తిస్తుంటే, మరోవైపు పంపిణీ ప్రక్రియలో నెలకొన్న గందరగోళం తీవ్ర చర్చకు దారితీస్తోంది. యాసంగి సాగు పెట్టుబడి కోసం ఎకరానికి రూ. 6 వేల చొప్పున ప్రభుత్వం సోమవారం నుండి నిధుల జమ ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 68 లక్షల మంది రైతులకు రూ. 3,446 కోట్లు విడుదల చేసినట్లు సర్కార్ ప్రకటించింది. అయితే, ఇక్కడే ఒక వింత పరిస్థితి ఎదురవుతోంది. రైతుకు ఎన్ని ఎకరాల భూమి ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి కేవలం ఒక ఎకరానికి సరిపడా రూ. 6 వేలు మాత్రమే ఖాతాల్లో జమ అవుతున్నాయి. దీంతో ఒకటి కంటే ఎక్కువ ఎకరాలు ఉన్న రైతులు తమ మిగిలిన భూమికి సాయం అందుతుందా? లేక ఈ మొత్తంతోనే సరిపెట్టుకోవాలా? అని అయోమయంలో పడ్డారు. ప్రభుత్వ స్పష్టత లేకపోవడంతో క్షేత్రస్థాయిలో గందరగోళం నెలకొనగా, ప్రతిపక్షాలు దీనిని 'రైతు వంచన'గా అభివర్ణిస్తూ ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపిస్తున్నాయి.

– అక్షరదర్బార్, వరంగల్

02



## ఎకరానికి 15 వేలు ఏమైనయి?

- గొప్పలు చెప్తిరి కదా.. ఆచరణ ఏమైంది?
- రైతు భరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం
- రైతులను మోసం చేసిన సర్కార్ ఇది..
- బీఆర్ ఎస్ ప్రభుత్వంలో ఒక్క సీజన్ అయినా రైతుబంధు ఆపలేదు..
- అసెంబ్లీలో సర్కార్‌ను నిలదీసిన మాజీ మంత్రి హరీశ్ రావు

05

## ప్రైవేట్ బిల్లుకు గులాబీ దళం ముందడుగు

- స్పీకర్‌కు కేటీఆర్ బృందం నోటీసు
- ఆరు గ్యారెంటీలపై పట్టుబట్టిన బీఆర్ఎస్

05



# రైతు భరోసా ఒక్క ఎకరానికే !

- తొలిరోజు జమ ప్రక్రియలో గందరగోళం
- ఒక రైతుకు ఎన్ని ఎకరాలున్నా.. ఒక ఎకరా సొమ్ము రూ.6 వేలే జమ
- మిగతా భూమికి సాయం సంగతేంటని రైతుల ప్రశ్నలు
- విడతల వారీగా ఇస్తారా? లేక ఈ సొమ్ముతోనే సరిపెట్టుకోవాలా? అనే సందిగ్ధం
- సర్కార్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్లు
- ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్న ప్రతిపక్షాలు

**అక్షరదర్బార్, వరంగల్ :**

తెలంగాణలో రైతు భరోసా నిధుల విడుదల ఒకవైపు రైతుల్లో కొత్త ఆశలు నింపుతుంటే, మరోవైపు సొమ్ము జమ ప్రక్రియలోని గందరగోళం అన్నదాతల్లో కొత్త చర్చకు దారితీస్తోంది. యాసంగి సీజన్‌కు సంబంధించి ఎకరానికి రూ.6 వేల చొప్పున ప్రభుత్వం నిధులు జమ చేయడం ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం దాదాపు 68 లక్షల మంది రైతులకు సంబంధించి రూ.3,446 కోట్లు తొలి విడతగా విడుదల చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఉదయం నుంచే రైతుల మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు వస్తుండటంతో గ్రామాల్లో సందడి నెలకొంది. అయితే ఈ పంపిణీలో ఒక వింత పరిస్థితి ఎదురవుతోంది. రైతుకు ఎన్ని ఎకరాల భూమి ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి కేవలం ఒక ఎకరానికి సరిపడా సొమ్ము మాత్రమే ఖాతాల్లో జమ అవుతుండటం గమనార్హం.

నిధులు విడుదలైన ఆనందం ఒకవైపు ఉన్నా, పంపిణీ ప్రక్రియలో చోటుచేసుకున్న ఈ పరిణామం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఒక రైతుకు ఎన్ని ఎకరాల భూమి ఉన్నప్పటికీ ప్రస్తుతానికి కేవలం ఒక ఎకరానికి సంబంధించిన రూ.6 వేల మాత్రమే జమ అవుతున్నాయి. ఒకటి కంటే ఎక్కువ ఎకరాలు ఉన్న వారు తమ మిగిలిన భూమికి నిధులు ఎప్పుడు వస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. కేవలం ఒక ఎకరానికే నిధులను పరిమితం చేస్తారా లేక విడతల వారీగా మిగతా మొత్తాన్ని అందిస్తారా అనే గందరగోళం రైతాంగంలో నెలకొంది. ఈ విధానంపై ఎకరం లోపు భూమి ఉన్న వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నా, ఎక్కువ భూమి ఉన్న వారు ప్రభుత్వ వైఖరిపై పెదవి విరుస్తున్నారు. భవిష్యత్తులో మిగిలిన భూమికి భరోసా అందుతుందా లేక ఈ రూ.6 వేలతోనే సరిపెట్టుకోవాలా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

### - స్పష్టత కోసం ఎదురుచూపులు

ప్రస్తుతానికి సామాజిక మాధ్యమాల్లో రైతులు తమ ఖాతాల్లో పడిన సొమ్ముకు సంబంధించిన స్క్రీన్ షాట్లు షేర్ చేస్తూ ఆనందం పంచుకుంటున్నా, ఆ లోపునే ఒక పెద్ద ప్రశ్న వారిని వెంటాడుతోంది. ప్రభుత్వం తదుపరి విడత నిధులను ఎప్పుడు విడుదల చేస్తుందనే విషయంలో అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అప్పుడే రైతుల్లో ఉన్న గందరగోళం తొలగిపోయే అవకాశం ఉంది. వ్యవసాయ పనులు ఊపందుకుంటున్న తరుణంలో ప్రభుత్వం సత్వరమే స్పందించి మిగిలిన నిధులను కూడా జమ చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. ఈ నిధుల పంపిణీ ప్రక్రియ రాబోయే రోజుల్లో ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

### - ప్రతిపక్షాల విమర్శలు

రైతు భరోసా అమలు తీరుపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపిస్తున్నాయి. ఎకరానికి రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పి, ఇప్పుడు కోతలు పెట్టడం ఏంటని ప్రశ్నిస్తున్నాయి. ఒక ఎకరానికే పరిమితం చేయడం రైతుల్ని వంచించడమేనని విమర్శిస్తున్నాయి. కేవలం గణాంకాల కోసం ఎక్కువ మందికి నిధులు వేసినట్లు చూపించుకోవడానికే ప్రభుత్వం ఈ ఎత్తుగడ వేసిందని ప్రతిపక్ష నేతలు దుమ్మెత్తిపోస్తున్నారు. రైతుల ఖాతాల్లో పూర్తి నిధులు జమ అయ్యే వరకు పోరాటం చేస్తామని హెచ్చరిస్తుండటంతో ఈ అంశం రాజకీయంగా కూడా వేడి పుట్టిస్తోంది.

### - విడతల వారీ పంపిణీ వ్యూహమా?

**ప్రభుత్వం ఎకరం భూమికి మాత్రమే నిధులు జమ చేయడానికి ప్రధాన కారణం రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సుమారు తొమ్మిది వేల కోట్ల రూపాయల నిధులు అవసరమైన చోట, తొలి విడతలో కేవలం ఒక ఎకరాన్ని ప్రామాణికంగా తీసుకుని నిధులు సర్దుబాటు చేసినట్లు కనిపిస్తోంది. దీనివల్ల ఎక్కువ మంది రైతులకు నగదు చేరినట్లు ఉంటుందని ప్రభుత్వం భావించినా, పెద్ద మొత్తంలో భూమి ఉన్న రైతులకు ఇది నిరాశే మిగిలిస్తోంది. సాగు పెట్టుబడి కోసం ఎదురుచూస్తున్న సమయంలో పూర్తి స్థాయిలో నిధులు అందకపోవడం వల్ల రైతులు ప్రైవేటు అప్పుల వైపు మళ్లే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ స్పష్టత లేకపోవడం వల్ల క్షేత్రస్థాయిలో అయోమయం పెరిగిపోతోంది.**

---

# ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమం



అక్షరదర్బార్, హనుమకొండ: ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ కార్యక్రమంలో అర్జీలను అందించగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్ రవి స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు 127 అర్జీలను కలెక్టర్, అదనపు కలెక్టర్లకు అందజేశారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను సంబంధిత శాఖల వారీగా త్వరగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన దరఖాస్తుల సమాచారాన్ని సంబంధిత అర్జీదారులకు ఆయా శాఖల అధికారులు తెలియజేయాలన్నారు. ఇటీవల జరిగిన దిశా కమిటీ సమావేశంలో వివిధ మండలాల్లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణాల కోసం స్థలాల కేటాయింపు అంశం గురించి చర్చించడం జరిగిందని, కాజీపేట, హనుమకొండ, ధర్మసాగర్, వేలేరు, హసన్ పర్తి మండలాల తహసిల్దార్లు ఆరోగ్య ఉప కేంద్రాల కోసం స్థలాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, డీఆర్డీఓ మేన శ్రీను, జడ్పీ సీఈవో శేషాద్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

---

# ప్రాణం తీసిన రూ.వంద గొడవ

- ఉరివేసుకున్న మహిళా కూలీ
- మానుకోట జిల్లా సూర్య తండాలో ఘటన

అక్షరదర్బార్, మహబూబాబాద్ : వంద రూపాయిల పంచాయితీ చివరకు నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూర్య తండాలో చోటుచేసుకున్నది. తండాకు చెందిన తేజవత్ కాంతి (55) అనే మహిళ కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో పక్క గ్రామంలో అజ్మీరా బాన్కీ, నీలతో కలిసి మిరప తోట ఏరడానికి కాంతి కూలి పనికి వెళ్లింది. ఆదివారం సాయంత్రం కూలి డబ్బుల లెక్కల విషయంలో తమ మధ్య వంద రూపాయల తేడా వచ్చిందని కాంతి సదరు మహిళలతో వాదనకు దిగింది. ఆ స్వల్ప మొత్తం తనకే రావాలని ఆమె పట్టుబట్టడంతో వారి మధ్య గొడవ జరిగింది. ఈ చిన్న వివాదం చిలికి చిలికి గాలివానగా మారి చివరకు ఒకరి ప్రాణం పోయే వరకు దారితీసింది. కూలి డబ్బుల వివాదం ఆదివారంతో ముగిసిపోకుండా సోమవారం తెల్లవారుజామున మరింత ముదిరింది. బాన్కీ, నీల కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం కాంతి ఇంటికి వచ్చి ఆమెపై దాడికి పాల్పడ్డారు. అందరి ముందు జరిగిన ఈ దాడితో తీవ్ర మనస్తాపానికి గురైన కాంతి, ఆ అవమానాన్ని తట్టుకోలేకపోయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కళ్లముందే ఉన్న తల్లి ఆత్మహత్య చేసుకోవడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. కాంతి మరణవార్త తెలియడంతో బంధువులు, స్థానికులు ఆగ్రహంతో ఊగిపోయారు. మృతదేహాన్ని తీసుకువెళ్లి దాడికి పాల్పడిన వారి ఇంటి ముందు ఉంచి పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆత్మహత్య చేసుకున్న కాంతి (ఫైల్ ఫొటో)

## పరకాల మున్సిపల్ పరిధిలో
# సంతల వేలం వాయిదా

- 25న తిరిగి నిర్వహణకు నిర్ణయం
- పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య వెల్లడి



అక్షర దర్బార్, పరకాల: పరకాల పురపాలక సంఘం పరిధిలోని తైబజార్, పశువుల సంత, గొర్రెలు–మేకల సంతల లీజు హక్కుల వేలం ప్రక్రియ వాయిదా పడింది. 2026-27 సంవత్సరానికి (01.04.2026 నుంచి 31.03.2027 వరకు) మార్కెట్ రుసుములు వసూలు చేసేందుకు సోమవారం నిర్వహించిన వేలంలో తైబజార్ సంతకు ఇద్దరు డిపాజిట్ చెల్లించగా, ఒక్కరే హాజరయ్యారు. పశువుల సంత, గొర్రెలు–మేకల సంతలకు ఎవరూ డిపాజిట్లు సమర్పించలేదు. ఈ నేపథ్యంలో వేలాన్ని వాయిదా వేస్తూ, తిరిగి ఈ నెల 25న బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్య తెలిపారు.వేలంలో పాల్గొనదలచిన వారు రూ.2 లక్షల డీడీ, రూ.5 లక్షల ఇంటి విలువ ధృవపత్రం, 9 చెక్కులు, రూ.2500 షెడ్యూల్ ఫీజు చెల్లించి, ఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. ఆసక్తి గల వారు నిర్ణీత సమయానికి హాజరై వేలంలో పాల్గొనాలని అధికారులు సూచించారు.ఇతర వివరాలకు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

## 26న చిట్యాల సంత వేలం పాట



అక్షర దర్బార్, చిట్యాల: మండల కేంద్రంలోని సంతలో చీటి వసూలుదారుల ఎంపిక కోసం ఈనెల 26న బహిరంగ వేలంపాట నిర్వహించ నున్నట్లు సర్పంచ్ తౌటం లక్ష్మీ అత్తయ్య, కార్యదర్శి రవి కుమార్ సోమవారం వెల్లడించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఈ వేలం ప్రారంభమవుతుందని తెలిపారు. వేలంలో పాల్గొనదలిచిన వారు స్థానికులై ఉండాలని, రూ.1,500 డిపాజిట్‌ను 25వ తేదీ సాయంత్రం లోపు గ్రామపంచాయతీలో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వేలంలో విజేతగా నిలిచిన వారికి ఒక సంవత్సరం పాటు సంతలో కూరగాయల వ్యాపారుల నుంచి చీటి వసూలు చేసే హక్కు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు బహిరంగ వేలంలో పాల్గొనాలని సూచించారు.



## ఉద్యమకారులకు అండగా నాగుర్ల..
### ఉద్యమకారుడికి ఆర్థిక సాయం అందజేత

అక్షర దర్బార్, పరకాల: ఉద్యమకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కష్టకాలంలో ఉద్యమకారులను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ఆపదలో ఉన్న వారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. నాగుర్ల వెంకటేశ్వర్ల ఆదేశానుసారం ఉద్యమకారుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సందెల సునీల్ ఆధ్వర్యంలో ఉద్యమకారులు దాతల సహకారంతో మొత్తం రూ.38,016 సేకరించి, ఆ మొత్తాన్ని నాగుర్ల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఎంజీఎంలో చికిత్స పొందుతున్న గీసుకొండ మండలం గొర్రెకుంట గ్రామానికి చెందిన ఉద్యమకారుడు కోట ప్రవీణ్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గుర్రం రఘు, మిద్దెపాక విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో మరింత భద్రత
### చిట్యాల ఎస్ఐ సతీష్




అక్షర దర్బార్, చిట్యాల : గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే భద్రత గణనీయంగా పెరుగుతుందని, అసాంఘిక కార్యకలాపాలను సమర్థంగా అరికట్టవచ్చని చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడిన ఆయన, ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో జూదం, గంజాయి వంటి సమస్యలు పెరుగుతున్నాయని, యువత మరియు పిల్లలు వాటి బారినపడుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు. గ్రామాల్లో వ్యాపారస్తులు, ట్రాక్టర్ యజమానులు, పెద్దలు కలిసి నిధులు సమీకరించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే 24 గంటల నిఘా సాధ్యమవుతుందని చెప్పారు. ఏదైనా ఘటన జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందడంతో నిందితులను త్వరగా గుర్తించి బాధితులకు న్యాయం చేయడం సులభమవుతుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, భద్రత కోసం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని ఎస్ఐ సతీష్ పిలుపునిచ్చారు.

## భగత్ సింగ్ ఆశయాలను నెరవేర్చాలి
### ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్




అక్షర దర్బార్,పరకాల: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు చదువులో రాణిస్తూ సమాజ సమస్యలపై పోరాడాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ అన్నారు. సోమవారం పరకాల పట్టణంలోని ప్రభుత్వ బాయ్స్ హైస్కూల్‌లో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ యవ్వనాన్ని సైతం త్యాగం చేసిన వీరుల స్ఫూర్తి ప్రతి విద్యార్థికి మార్గదర్శకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ముట్టడి విజయవంతం



అక్షర దర్బార్, శాయంపేట: బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన అసెంబ్లీ ముట్టడి విజయవంతమైందని మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఆయన ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తోందని విమర్శించిన ఆయన, ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులకు పాల్పడుతోందని ఆరోపించారు. అరెస్టైన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దాసరి తిరుపతి, భూతం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ అరెస్టులు ప్రభుత్వ పిరికిచర్య
### బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్

అక్షర దర్బార్, చిట్యాల: రాత్రి వేళల్లో బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రభుత్వ పిరికి చర్య అని మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ఎన్నికల హామీల అమలుకు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో నాయకులను అడ్డుకోవడం చేతగానితనానికి నిదర్శనమని విమర్శించారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో జిల్లా ఉపాధ్యక్షుడు గోపాలపురం సర్పంచ్ గొర్రె శేషి కుమార్, గుండ సురేష్, రాయిని శ్రీనివాస్, సాద సదానందం, కేంసారపు ప్రభాకర్, వల్లాల ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్
# రుణాల గడువు పెంచాలి

అక్షర దర్బార్, చిట్యాల: ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల దరఖాస్తు గడువును ఏప్రిల్ 14 వరకు పొడిగించాలని AYS రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య కోరారు. సోమవారం చిట్యాల ఎంపీడీవో జయశ్రీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ, ఈనెల 17 నుంచి 24 వరకు దరఖాస్తు గడువు ఉన్నప్పటికీ మధ్యలో సెలవులు రావడంతో కుల, ఆదాయ సర్టిఫికెట్లు పొందలేక చాలామంది దరఖాస్తు చేయలేకపోయారని తెలిపారు. అందువల్ల గడువును పొడిగించి మరింత మంది లబ్ధిదారులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వ్యాపారానికి సంబంధించిన యూనిట్లను పెంచి, ఎక్కువ మందికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కట్కూరి రాజు, నేరెళ్ల రమేష్, రత్న రమేష్, జీడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.






# గృహలక్ష్మి లబ్ధిదారులను ఆర్థికంగా ఆదుకోవాలి

## కలెక్టర్ కు వినతి ఇచ్చిన ముస్త్యాలపల్లి సర్పంచ్

అక్షరదర్బార్, పరకాల: గృహలక్ష్మి పథకం కింద మంజూరైన ఇళ్లకు సంబంధించిన బిల్లులు విడుదల చేసి తమను ఆర్థికంగా ఆదుకోవాలని నడికూడ మండలం ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులు కోరారు. సోమవారం గ్రామ సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను ప్రజావాణిలో కలిసి వినతి పత్రం సమర్పించారు. గత ప్రభుత్వంలో గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు మంజూరు కావడంతో అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టినప్పటికీ ఇప్పటివరకు బిల్లులు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తమకు వర్తింపజేసి సహాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో లడే రాములు, చింపన్న ఆదిరెడ్డి, గంధం శ్రీను, రాగళ్ల మహేష్, బండెల రవీందర్, వాడికారి రాజన్న, దుబాసి శోభన్, తిప్పరపు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రీతమ్ కు జన్మదిన శుభాకాంక్షలు

అక్షరదర్బార్, పరకాల: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, ఏఐసీసీ ఎస్సీ సెల్ జాతీయ కో–ఆర్డినేటర్ నాగరి గారి ప్రీతమ్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం హైదరాబాద్‌లో పలువురు కాంగ్రెస్ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్–చైర్మన్, నేషనల్ డా. బీఆర్ అంబేద్కర్ అవార్డు గ్రహీత (2018) డాక్టర్ మడికొండ శ్రీను, టీపీసీసీ ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ రాష్ట్ర చైర్మన్ దబ్బేట రమేష్, రాష్ట్ర కన్వీనర్లు నత్తి కొర్నీల్, అర్షం అశోక్, యూత్ కాంగ్రెస్ నాయకుడు బొజ్జం సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# అమరవీరులకు నివాళి

అక్షరదర్బార్, నడికూడ: అమరవీరుల దినోత్సవం సందర్భంగా మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం వీరు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. వారి ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కంచరాజు కుమార్, పుల్లూరి రామకృష్ణతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.




- 57.7 శాతం వసూలు
- రూ.3.82 కోట్లలో రూ.2.20 కోట్లు వసూలు
- ఇంకా రూ.1.60 కోట్లు బకాయి
- బకాయిదారులపై కఠిన చర్యలు

# పన్నుల వసూళ్లపై ఫోకస్..

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీలో ఆస్తి పన్నుల వసూళ్లపై అధికారులు కఠిన వైఖరి అవలంబిస్తున్నారు. మొత్తం ₹3.82 కోట్ల లక్ష్యానికి గాను ఇప్పటి వరకు ₹2.20 కోట్లు వసూలు చేసి 57.7 శాతం సాధించినట్లు మున్సిపల్ కమిషనర్ అంజయ్య తెలిపారు. ఇంకా ₹1.60 కోట్లు వసూలు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. మున్సిపాలిటీకి బకాయిలు ఉన్న పన్నులను పట్టణ ప్రజలు వెంటనే చెల్లించాలని కమిషనర్ కోరారు. మార్చి 30 లోపు బకాయిలను చెల్లించి పెనాల్టీలకు గురికాకుండా చూడాలని సూచించారు. పట్టణ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### నోటీసులు పట్టించుకోకపోతే చర్యలు

కొన్ని ప్రాంతాల్లో నాలుగైదు సంవత్సరాలుగా పన్నులు చెల్లించని ఇంటి యజమానులకు మున్సిపాలిటీ అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. అయితే, వాటిని పట్టించుకోకపోవడంతో అధికారులు తదుపరి చర్యలకు దిగుతున్నారు.

### వసూళ్లపై ఫోకస్

మున్సిపల్ సిబ్బందిని అప్రమత్తం చేసిన కమిషనర్ వసూళ్ల శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. నిర్ణీత గడువులోపు పూర్తి వసూళ్లకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# 28న మెగా లోక్ అదాలత్

- రాజీతో సమస్యను పరిష్కరించుకోండి
- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్



అక్షరదర్బార్, హనుమకొండ: ఈ నెల 28న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఒక ప్రకటనలో కోరారు. జాతీయ లోక్ అదాలత్ లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ తదితర కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని సీపీ పేర్కొన్నారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్స్, ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుందని వివరించారు. ఈ నేపథ్యంలో ఎవరైనా తమ కేసుల్లో రాజీ కావాలని అనుకున్న వారు పోలీస్ అధికారులను సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని సన్ ప్రీత్ సింగ్ తెలిపారు.

# లోక్ ఆదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

## వెంకటాపూర్ ఎస్ఐ చల్ల రాజు



అక్షర దర్బార్, వెంకటాపూర్ : నేషనల్ లోక్ ఆదాలత్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెంకటాపూర్ ఎస్ఐ చల్ల రాజు సూచించారు. మార్చి 23 నుంచి 28 వరకు జేఎఫ్సీఎం ములుగు కోర్టులో లోక్ ఆదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాక్సిడెంట్, ఘర్షణ, చీటింగ్, వివాహ సంబంధిత కేసులు, దొంగతనం వంటి వివాదాలను రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ఫిర్యాదుదారులు, ప్రత్యర్థులు ఆధార్ కార్డుతో కోర్టుకు హాజరై కేసులను పరిష్కరించుకోవాలని కోరారు.



# బ్యాంకుల జోక్యం లేకుండా ఎస్సీ రుణాలు ఇవ్వాలి

అక్షర దర్బార్, చిట్యాల: ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలను బ్యాంకులతో సంబంధం లేకుండా ప్రభుత్వం నేరుగా అందించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు నేరెళ్ల ఓదెలు, దొడ్డే శంకర్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కులస్తుల జీవనోపాధి కోసం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నప్పటికీ, దరఖాస్తు గడువును కనీసం 15 రోజులు పెంచాలని కోరారు. కులం, ఆదాయం, నివాస సర్టిఫికెట్లు అందక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి మరికొన్ని రోజులు గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భద్రయ్య, రామకృష్ణ, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్ గ్యాస్ గోదాంలో తనిఖీ

## క్రషర్ మిల్లును పరిశీలించిన తహసీల్దార్



అక్షర దర్బార్, శాయంపేట: మండలంలోని గ్రామ శివారులో ఉన్న భారత్ గ్యాస్ గోదాంను తహసిల్దార్ ఆర్. ప్రవీణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాంలో నిల్వలు, పంపిణీ రిజిస్టర్లు పరిశీలించి వినియోగదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మండలంలో మొత్తం 1100 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, ప్రస్తుతం 440 గృహ సిలిండర్లు, 32 వాణిజ్య సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వినియోగదారులకు సమయానికి సరఫరా చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పత్తిపాక శివారులోని శ్రీ వెంకటేశ్వర క్రషర్ మిల్లును పరిశీలించి, రైతులకు నష్టం కలిగితే సహించబోమన్నారు. రిజిస్ట్రేషన్ పత్రాలు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీఏ సేవలు ఇక డిజిటల్

- మొబైల్ లోనే 52 రకాల సేవలు
- ఆఫీసుల చుట్టూ తిప్పలకు చెక్
- రెండో బండిపై ట్యాక్స్ కూడా రద్దు
- వాహన్ పోర్టల్ ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**అక్షరదర్బార్, హైదరాబాద్ :**

తెలంగాణ రవాణా శాఖలో సరికొత్త అధ్యాయం మొదలైంది. వాహనదారుల ఏళ్లనాటి కష్టాలకు చెక్ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆర్టీఏ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఇంట్లో కూర్చునే 52 రకాల సేవలను పొందేలా 'జాతీయ వాహన్ పోర్టల్'ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ప్రారంభించారు. రవాణా శాఖ సేవలను మరింత సులభతరం చేసేందుకే ఈ విధానం అందుబాటులోకి వచ్చిందని మంత్రి తెలిపారు. గతంలో వాహన రిజిస్ట్రేషన్, పేరు మార్పు, అడ్రస్ కరెక్షన్ వంటి పనుల కోసం వాహనదారులు తప్పనిసరిగా ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ఏజెంట్ల ప్రమేయం వల్ల సామాన్యులపై ఆర్థిక భారం పడేది. ఇప్పుడు ఈ పోర్టల్ అందుబాటులోకి రావడంతో ప్రజలు తమ వాహనాలకు సంబంధించిన పనులను ఆన్‌లైన్‌లోనే పూర్తి చేసుకోవచ్చు. పారదర్శకమైన, వేగవంతమైన సేవలు



అందించడమే ఈ కొత్త వ్యవస్థ ప్రధాన లక్ష్యం అని వెల్లడించారు.

### - జాతీయ డేటాబేస్ తో అనుసంధానం

రాష్ట్ర రవాణా శాఖ సేవలు ఇప్పుడు జాతీయ వాహన్ పోర్టల్‌తో అనుసంధానం అయ్యాయి. దీనివల్ల రాష్ట్రంలోని వాహనాల సమాచారం అంతా ఒకే చోట లభించడమే కాకుండా, అంతర్రాష్ట్ర వాహనాల బదిలీ ప్రక్రియ ఎంతో సులభం కానుంది. గతంలో ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వాహనాన్ని బదిలీ చేయాలంటే ఎన్‌ఓసీ తీసుకోవడం పెద్ద ప్రహసనంగా ఉండేది. ఇకపై ఆ అవసరం లేకుండా ఆటోమేటిక్ గా ఆన్‌లైన్ ద్వారానే బదిలీ చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. వాహనాల రిజిస్ట్రేషన్ల నుంచి యాజమాన్యం మార్పు వరకు ప్రతిదీ సాఫీగా సాగిపోయేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

### - రెండో వాహనంపై పన్ను రద్దు

వాహనదారులకు మరో తీపి కబురును ప్రభుత్వం అందించింది. రెండో వాహనం కొనుగోలు చేసినప్పుడు ప్రస్తుతం అమలులో ఉన్న 2 శాతం అదనపు లైఫ్ టాక్స్‌ను రద్దు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. గతంలో కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా ఈ పన్నును ప్రవేశపెట్టినప్పటికీ, వాహనదారులకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ప్రస్తుత ప్రభుత్వం దీనిని తొలగించింది. మార్చి 23వ తేదీ నుంచే ఈ నిర్ణయం అమలులోకి రానుంది. దీంతో కొత్తగా వాహనాలు కొనేవారికి భారీగా ఆర్థిక వెసులుబాటు లభించనుంది.

### - దశలవారీగా సేవలు.. సిబ్బందికి శిక్షణ

వాహన్ పోర్టల్ ద్వారా మొదటి దశలో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లను మాత్రమే ఆన్‌లైన్ చేయనున్నారు. ఆ తర్వాత మిగిలిన సేవలను కూడా ఒకటొకటిగా జోడిస్తారు. ఈ కొత్త సాంకేతికతపై ఆర్టీఏ అధికారులు, సిబ్బందితో పాటు ఆటోమొబైల్ డీలర్లకు కూడా ఇప్పటికే ప్రత్యేక శిక్షణ పూర్తి చేశారు. ఆన్‌లైన్ సేవల్లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా నైపుణ్యాన్ని పెంపొందించారు. వాహనాలు చోరీకి గురైనా లేదా ప్రమాదాలు జరిగినా ఈ పోర్టల్ ద్వారా వాటి ఆచూకీ కనిపెట్టడం పోలీసులకు, అధికారులకు మరింత సులభం కానుంది.

---

## మొండి బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టండి

- కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- నగరంలో పన్ను వసూళ్ల పరిశీలన

అక్షరదర్బార్, హనుమకొండ: మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని 48, 49, 50, 51 డివిజన్లలో పర్యటిస్తూ వసూళ్ల తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. నక్కలగుట్ట సర్కిల్ కార్యాలయంలోని ఈ-సేవ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి రోజువారీ వసూళ్ల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రెవిన్యూ అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి బకాయిల వసూళ్ల ప్రక్రియను సమీక్షించారు. సంబంధిత డివిజన్లలో బకాయిల జాబితా, ఇప్పటివరకు వసూలైన మొత్తం, మిగిలిన బకాయిల వివరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. బిల్ కలెక్టర్లు ప్రతి 20 అస్సెస్మెంట్ల చొప్పున విభజించి ప్రణాళికాబద్ధంగా వసూళ్లు చేపట్టాలని, పీఓఎస్ యంత్రాల ద్వారా ప్రజలు స్థానికంగానే పన్నులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని డివిజన్లలో లక్షల్లో బకాయిలు ఉన్నాయని పేర్కొంటూ, ప్రతి వార్డులో రోజుకు కనీసం రూ.3 లక్షల వసూళ్లు సాధించాలని సూచించారు. హౌస్ నంబర్లలో ఉన్న లోపాలను వెంటనే సరిచేసి, నగరంలోని ప్రతి గృహం నుంచి పన్ను చెల్లింపులు జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

## ఎకరానికి 15 వేలు ఏమైనయ్?

- గొప్పలు చెప్తిరి కదా.. ఆచరణ ఏమైంది?
- రైతులను మోసం చేసిన సర్కార్ ఇది..
- అసెంబ్లీలో సర్కార్ ను నిలదీసిన మాజీ మంత్రి హరీశ్ రావు



అక్షరదర్బార్, హైదరాబాద్ : ఎకరానికి రూ.15 వేల పెట్టుబడి సాయం ఏమైంది? బీఆర్ ఎస్ ప్రభుత్వం ఎకరానికి ఏడాదికి రూ.12 వేలే ఇచ్చింది ? మేం అధికరంలోకి వస్తే రూ.15 వేలు ఇస్తామని బీరాలు పలికితిరి కదా? ఇప్పుడేమైంది? ఆచరణ ఏమైంది? రైతు భరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తున్నది. రైతులను మోసం చేసిన సర్కార్ ఇది అంటూ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు అసెంబ్లీ వేదికగా సోమవారం సర్కార్‌ను నిలదీశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చామని మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ప్రచారం సందర్భంగా తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15 వేలు రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చారని, తొలి బడ్జెట్‌లో ప్రకటించి, ఆ తర్వాత దానిని 12 వేల రూపాయలకు తగ్గించారని మండిపడ్డారు. మా ప్రభుత్వాన్ని మూడో పంటకు కూడా రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఒక పంటకే ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏటా ఒక సీజన్‌కే రైతు భరోసా ఇస్తూ.. రుణమాఫీ చేశా మని గొప్పలు చెప్పుకున్నారని మండిపడ్డారు.

### - బడ్జెట్ లో పెట్టినవి కూడా అమలుకాలే..

బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారని విమర్శించారు. రెండు బడ్జెట్లలో పెట్టిన పంటల బీమా ఈ బడ్జెట్‌లో మాయమైందని అన్నారు. రైతు కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయలు ఇస్తామని కూడా రెండు బడ్జెట్‌లలో పెట్టారని, కానీ ఒక్కసారి కూడా ఇవ్వలేదని చెప్పారు. జాబ్ క్యాలెండర్ త్వరలోనే ప్రారంభిస్తామని గత బడ్జెట్‌లో చెప్పారని, ఈసారి బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదని హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం ఎక్సైజ్ ఆదాయాన్ని వచ్చే ఏడాదికల్లా రూ.12 వేల కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం 34 వేల కోట్లుగా ఉన్న ఎక్సైజ్ ఆదాయాన్ని 46 వేల కోట్ల రూపాయలకు ఎట్లా పెంచుతారని, ఊరూరుకు బార్లు ఓపెన్ చేస్తారా..? అని నిలదీశారు. దాంతో ఎక్సైజ్ మంత్రి జూపల్లి కలుగజేసుకుని కాంగ్రెస్ హయాంలో 12 వేల కోట్ల రూపాయలుగా ఉన్న ఎక్సైజ్ ఆదాయాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం 36 వేల కోట్ల రూపాయలకు పెంచిందని అన్నారు. జూపల్లి కలుగజేసుకోవడంపై హరీష్‌రావు అసహనం వ్యక్తం చేశారు. తన ప్రశ్నకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని అన్నారు. తాను బడ్జెట్‌పై ప్రశ్నలు అడుగుతున్నానని, ఎక్సైజ్ శాఖకు సంబంధించిన సబ్జెక్టుపై కాదని చెప్పారు. ఈ సందర్భంగా తలసాని జోక్యం చేసుకుని ప్రభుత్వ తీరును ఆయన విమర్శించారు.

## ఎన్పీడీసీఎల్ కు గవర్నెన్స్ నౌ పురస్కారం

### - సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి హర్షం

అక్షరదర్బార్, హనుమకొండ :
హనుమకొండ కేంద్రంగా పనిచేస్తున్న ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) జాతీయ స్థాయిలో సత్తా చాటింది. ఆపరేషనల్ ఎక్సలెన్స్, డిజిటల్ టెక్నాలజీ విభాగాల్లో కనబరిచిన సేవలకు గవర్నెన్స్ నౌ పురస్కారం దక్కింది. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కంపెనీ సెక్రటరీ వెంకటేశం ఈ అవార్డును స్వీకరించగా, హనుమకొండలోని విద్యుత్ భవన్‌లో సోమవారం సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. సంస్థ అమలు చేస్తున్న అత్యాధునిక సాంకేతిక పద్ధతులే ఈ అవార్డులకు ప్రధాన కారణమని సీఎండీ తెలిపారు.

## తక్షణ పరిష్కారమే లక్ష్యం

### - ప్రజాదివాస్ లో జిల్లా ఎస్పీ సంకీర్త్

అక్షరదర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రజాదివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన పిర్యాదుదారుల నుంచి మొత్తం 10 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ, సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

## ప్రైవేట్ బిల్లుకు గులాబీ దళం ముందడుగు

- స్పీకర్ కు కేటీఆర్ బృందం నోటీసు
- ఆరు గ్యారెంటీలపై పట్టుబట్టిన బీఆర్ఎస్

అక్షరదర్బార్, హైదరాబాద్ : అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు కీలక అడుగు వేశారు. ఈ మేరకు రూపొందించిన ప్రైవేట్ మెంబర్ బిల్లు నోటీసును సోమవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు అసెంబ్లీ సెక్రటరీకి కూడా అందజేశారు. బిల్లు ద్వారా ప్రజా హామీలకు పూర్తిస్థాయి చట్టపరమైన రక్షణ లభిస్తుందని కేటీఆర్ పేర్కొంటూ, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే దీనిని ప్రవేశపెట్టేందుకు అనుమతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగదీష్‌రెడ్డి, మల్లారెడ్డి సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొని, గ్యారెంటీల అమలుపై తమ నిబద్ధతను చాటారు.

## కోర్టుకు బాంబు బెదిరింపు

అక్షరదర్బార్, ములుగు: జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు రావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కోర్టు ఆవరణలో బాంబు పెట్టినట్టు ఒక అజ్ఞాత వ్యక్తి మెయిల్ పంపడంతో యంత్రాంగం ఒక్కసారిగా అప్రమత్తమైంది. ములుగు జిల్లా కోర్టులో బాంబు అమర్చినట్లు గుర్తుతెలియని వ్యక్తి నుంచి కోర్టు అధికారులకు మెయిల్ వచ్చింది. ఈ విషయాన్ని గమనించిన కోర్టు సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ వెంటనే అక్కడికి చేరుకున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా పోలీసులు కోర్టులోని లాయర్లు, సిబ్బంది, కక్షిదారులను హుటాహుటిన బయటకు పంపించి ఆవరణను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రస్తుతం పోలీసులు, డాగ్ స్క్వాడ్ సాయంతో కోర్టులోని ప్రతి గదిని, పరిసర ప్రాంతాలను అణువణువూ తనిఖీ చేశారు. ఇది కేవలం ఆకతాయిల పనినా లేక మరేదైనా కుట్ర ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మెయిల్ పంపిన ఐపీ అడ్రస్ ఆధారంగా నిందితుడిని పట్టుకునేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్
విప్లవంలో
భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం
QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా
వార్తలను పొందండి.

**ప్రతిరోజు మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : aksharadarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915